ప్రజా విశ్వంభర
V3 NEWS
లక్ష్యం సమాజహితం

# మెట్రో నగరాల్లో వేగంగా కుంగిపోతున్న భూమి

## సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన కేంద్రం

**విశ్వంభర, నేషల్ బ్యూరో :** దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో క్రమంగా భూమి కుంగిపోతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో మహానగరాల్లో భూమి కుంగుబాటు సమస్యలపై ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దేశ రాజధాని ఢిల్లీ సహా కోల్‌కతా, ఆర్థిక రాజధాని ముంబయి, చెన్నై నగరాల్లో భూమి కుంగిపోవడానికి కారణాలను పరిశీలించడానికి కేంద్రం ఈ మేరకు నలుగురు సభ్యులతో కూడిన ఒక సంయుక్త కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ భూమి కుంగిపోతున్న తీరును పరిశీలించి దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయనుంది. ఇదే సమయంలో భూమి కుంగుబాటు నివారణ చర్యలను, పరిష్కార పరిష్కార మార్గాలను కూడా ప్రతిపాదించనుంది. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ( జాతీయ హరిత ట్రైబ్యునల్) ఆదేశాల మేరకు కేంద్రం ఈ చర్యలు తీసుకుంది. కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ ఈ కమిటీని ఏర్పాటు చేసింది. మే 29న నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఛైర్ పర్సన్ జస్టిస్ ప్రకాశ్ శ్రీవాత్సవ నేతృత్వంలోని ప్రధాన బెంచ్ విచారణ సందర్భంగా ఈ అంశంపై ఆదేశాలు జారీ చేసింది.

### కమిటీలో నాలుగు సంస్థల నుంచి ఒక్కొక్కరు

ఈ క్రమంలోనే సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ ఇటీవల ఎన్జీటీకి సమర్పించిన రిపోర్టులో కమిటీ వివరాల్ని వెల్లడించింది. ఈ కమిటీలో సీజీడబ్ల్యూఏ తో పాటుగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా , మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ , భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) నుంచి కూడా ఒక్కొక్క ప్రతినిధి ఉన్నట్లు స్పష్టం చేసింది. అంటే నాలుగు వేర్వేరు సంస్థల నుంచి కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించింది. ఇక కమిటీ కో ఆర్డినేటర్‌గా సీజీడబ్ల్యూఏ సైంటిస్ట్ అలోక్ కుమార్ సిన్హా వ్యవహరించనున్నారు. ఎంవోహెచ్ యూఏ తరపున మోనిస్ ఖాన్ ఈ కమిటీలో సభ్యుడిగా ఉండగా, ఇస్రో నుంచి రిత్విక్ మజుందార్, జీఎస్ఐ నుంచి పీకే గజ్‌బియే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

### అసలు భూమి ఎందుకు కుంగుతోంది?

మెట్రో సిటీల్లో భూమి కుంగిపోవడంపై గతేడాది నవంబరులోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ దృష్టిసారించింది. అప్పట్లోనే ఒక అంతర్జాతీయ అధ్యయనాన్ని ఆధారంగా చేసుకొని వచ్చిన మీడియా రిపోర్టును పరిశీలించిన ట్రైబ్యునల్ ఈ అంశంపై సుమోటో కింద నమోదు చేసింది. 2015 నుంచి 2023 వరకు శాటిలైట్ అబ్జర్వేషన్స్‌ను బట్టి నిర్వహించిన అధ్యయనంలో ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబైలో సుమారు 878 చదరపు కిలోమీటర్ల ప్రాంతం భూమి కుంగుబాటుకు గురవుతున్నట్లు గుర్తించారని నివేదికలు పేర్కొన్నాయి. భూమి కుంగిపోవడానికి ప్రధాన కారణాల్లో భూగర్భ జలాలు తగ్గుతుండటం ఒకటిగా అధ్యయనం పేర్కొంది. ఇదే సమయంలో

నగరాల్లో పెరుగుతున్న జనాభా, వేగంగా జరుగుతున్న నిర్మాణాలు, విపరీతంగా పెరుగుతున్న భూగర్భ జలాల వినియోగం వంటి అంశాలు కూడా భూమి కుంగుబాటుకు కారణంగా ఉన్నాయా లేదా అనే అంశాల్ని కూడా కమిటీ పరిశీలించనుంది. ఇక్కడ భూమి కుంగుబాటుకు అసలైన సమస్యను తెలుసుకోవడానికి కమిటీ వివిధ రకాల సమాచారాన్ని సేకరించి పరిశీలించనుంది. ఇందులో హైడ్రోజియోలాజికల్, జియోటెక్నికల్, భూగర్భ జలాలు, రిమోట్ సెన్సింగ్, పట్టణీకరణ, భూమి వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంది. అందుబాటులో ఉన్న శాస్త్రీయ, సాంకేతిక సమాచారాన్ని ఆధారంగా చేసుకొని భూమి కుంగుబాటుకు దారితీస్తున్న అంశాలపై కమిటీ చర్చించనుంది. ఇక దీనికి సంబంధించి అధ్యయనం పూర్తయ్యాక CGWA భూమి కుంగుబాటు సమస్యను వీలైనంత తగ్గించేందుకు తగిన పరిష్కార మార్గాలకు సూచనలు సిద్ధం చేసి NGTకి సమర్పించనున్నట్లు తెలిపింది. అయితే నివేదిక సమర్పించాల్సిన కచ్చితమైన గడువును మాత్రం వెల్లడించలేదు. మెట్రో నగరాల్లో జనాభా విపరీతంగా పెరుగుతుండటం దానికి అనుగుణంగా భూగర్భ జలాల వినియోగం పెరగడం, మౌలిక వసతుల విస్తరణ నేపథ్యంలో భూమి కుంగుబాటు సమస్య పరిష్కారానికి సంబంధించి ఈ కమిటీ చేసే సూచనలు భవిష్యత్తులో నష్టాన్ని తగ్గించడానికి కీలకం కానున్నాయి.

---

# దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ ప్రముఖులు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించేందుకు, నివాళులు అర్పించేందుకు పలువురు ప్రముఖులు చెన్నైలోని ఆయన నివాసానికి తరలివెళ్తున్నారు.

### వెండితెరపై వినూత్న ప్రయోగాలు..

సింగీతం శ్రీనివాసరావు కేవలం ఓ దర్శకుడిగా మాత్రమే కాకుండా, భారతీయ సినిమా దిశను మార్చిన దర్శకుడిగా చిరస్మరణీయుడిగా నిలిచిపోయారు. కేవలం వాణిజ్య చిత్రాలకే పరిమితం కాకుండా, ఎవరూ ఊహించని విభిన్న కథాంశాలతో ఆయన సృష్టించిన సినిమాలు భారతీయ సినిమా చరిత్రలో మైలురాళ్లుగా నిలిచాయి. తెలుగు తెరపై టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో తెచ్చిన ఆదిత్య 369 , అప్పట్లో జానపద చిత్రాలకు సరికొత్త జీవం పోసిన భైరవ ద్వీపం , ఒక్క డైలాగ్ కూడా లేకుండా తెరకెక్కించిన మ్యూజికల్ మూకీ చిత్రం 'పుష్పక విమానం' ఆయన అసామాన్య ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలు.

### 94 ఏళ్ల వయసులోనూ తగ్గని జోరు..

తన జీవితాంతం సినిమా కథలకే అంకితమైన సింగీతం శ్రీనివాసరావు, తన చివరి క్షణం వరకు కథలు చెప్పాలనే తపనను వీడలేదు. తన 94వ ఏట కూడా ఏమాత్రం తగ్గని ఉత్సాహం, సృజనాత్మక స్ఫూర్తితో డైరెక్టర్ నాగ్ అశ్విన్ నిర్మాతగా స్వప్న సినిమా బ్యానర్‌పై సింగ్ గీతం అనే మ్యూజికల్ ఫాంటసీ చిత్రాన్ని డైరెక్ట్ చేసి యువ దర్శకులకు సైతం ఆదర్శంగా నిలిచారు. దర్శకుడిగా, స్క్రీన్‌ప్లే రచయితగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగానూ సిగీతం తన సత్తా చాటుకున్నారు. డాక్టర్ రాజ్‌కుమార్, లోకనాయకుడు కమల్ హాసన్ వంటి దిగ్గజ నటులతో ఆయన చేసిన కాంబినేషన్లు బాక్సాఫీస్ వద్ద సంచలనాలే సృష్టించాయి. చారిత్రాత్మక చిత్రం 'మాయాబజార్'కు కేవీ రెడ్డి వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించి, దశాబ్దాల పాటు తెలుగు సినిమా కీర్తిని సింగీతం శ్రీనివాసరావు విశ్వవ్యాప్తం చేశానరడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

# క్వాలిటీ , క్వాంటిటీ కి ప్రాధాన్యత ఇవ్వాలి

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫార్ములు, షూస్, పుస్తకాలు తదితర వస్తువులు ఆలస్యం లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం గురుకులాలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పీఎంయూ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు.సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్య సాచి ఘోష్, ఎస్సీడీడీ కార్యదర్శి విజయేంద్ర బోయి ఉన్నతాధికారులతో ఈ సమీక్ష నిర్వహించారు.రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు చేరిన యూనిఫార్ములు, షూస్, పుస్తకాలు తదితర సామగ్రిని విద్యార్థులకు వెంటనే అందించాలని మంత్రి సూచించారు. సరఫరా ఎక్కడ నిలిచిపోయింది.. ప్రొక్యూర్‌మెంట్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అనే అంశాలను గుర్తించి జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు*. ప్రతి అంశానికి నిర్దిష్ట గడువు నిర్ణయించి, పురోగతిపై నివేదికలు తీసుకోవాలని సూచించారు. వందలాది మంది విద్యార్థులు ఉండే పెద్ద క్యాంపస్‌లలో ప్రస్తుత పారిశుద్ధ్య సిబ్బంది సరిపోతున్నారా అనే అంశాన్ని పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట్ల పారిశుద్ధ్య, స్కావెంజింగ్ సేవలను సమర్థంగా నిర్వహించేందుకు తగిన విధానం రూపొందించాలన్నారు. స్థానిక అవసరాలను బట్టి కాంటింజెన్సీ సిబ్బందిని వినియోగించడంతో పాటు, అవసరమైతే పారదర్శక ఆన్‌లైన్ టెండర్ విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతము సిబ్బందికి అందిస్తున్న వేతనాలు చాలా తక్కువ ఉన్నాయి అని వాటిని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులు ఆదేశించారుగురుకులాలను పూర్తి స్థాయిలో మరింత తీర్చిదిద్దేందుకు విద్యార్థుల సంఖ్య, స్థానిక అవసరాలకు అనుగుణంగా సమగ్ర మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. తరగతి గదులు, వంటశాలలు, తాగునీరు, ఆర్ఓ ప్లాంట్లు, వాషింగ్ సదుపాయాలు, శానిటేషన్, అవసరమైన పరికరాలను ఒకే ప్రణాళికలో చేర్చాలన్నారు*. ఇప్పటికే అమలులో ఉన్న మంచి ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ నమూనాలను పరిశీలించి, అనువైన వాటిని ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట్ల భద్రతా సిబ్బంది, పోలీసు సమన్వయం, సీసీ కెమెరాల ఏర్పాటుపై సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. ముఖ్యంగా బాలికల గురుకుల విద్యాలయాల సంస్థల లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని స్థానిక పోలీస్ స్టేషన్ కు అనుసంధానం చేయాలని మంత్రి ఆదేశించారు.

గురుకులాల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. బోధనా విధానంలో ఏకరూపత తీసుకురావడంతో పాటు గతంలో ఎదురైన బోధనా సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో సబ్జెక్టు నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఆన్‌లైన్ తరగతులు, రిమోట్ అకడమిక్ సపోర్ట్, ఫౌండేషన్ కోర్సులను విస్తరించాలని సూచించారు. హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్న సబ్జెక్టు నిపుణుల సేవలను జిల్లాల విద్యార్థులకు కూడా ఉపయోగపడేలా వర్చువల్ తరగతులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్, డిజిటల్ లెర్నింగ్ వనరులు, అదనపు కోచింగ్ అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు మార్గదర్శనం కల్పించాలని సూచించారు.ఈ సమీక్షలో ఎస్సీ గురుకులాల కార్యదర్శి రవి గుగులోతు, ఎస్టీ గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి, ఆశ్రమ పాఠశాలల డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# ఆ ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే..

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** 'సర్' ప్రక్రియ కేంద్రంగా దేశంలో ప్రస్తుతం రాజకీయ పరిణామాలు హాట్ టాపిక్‌గా మారాయి. కేంద్ర ఎన్నికల సంఘంలో సభ్యుల మధ్య అభిప్రాయ భేదాల అంశం, సర్ ప్రక్రియలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియపై మాట్లాడిన ఆయన దేశంలో అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధంగానే జరిగాయని ఆరోపించారు. ఈ క్రమంలో లోక్‌సభతో పాటుగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి మళ్లీ కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఈవీఎం పద్ధతిలో కాకుండా ఇప్పుడు బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. శనివారం రోజు కర్ణాటక కలబురగిలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ సహా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎన్నికలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు నిర్వహించినా ఈవీఎంల దుర్వినియోగం తీవ్ర స్థాయిలో జరుగుతుందని ఖర్గే మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన నేతలే స్వయంగా ఇది చెబుతున్నారని అన్నారు. అధికార బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు వార్డులు, పంచాయతీలు, గ్రామాలకు వెళ్లి ఎక్కువగా పేదలు, గిరిజనులు, దళితులు, మైనార్టీల ఓట్లను కావాలని తొలగిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 30న జరిగిన ఇండియా కూటమి సమావేశాన్ని కూడా ఖర్గే ఈ సందర్భంగా ప్రస్తావించారు. అక్కడ దాదాపు 20 పార్టీల ప్రతినిధులు, ఆయా పార్టీలకు చెందిన లీగల్ సెల్ ప్రతినిధులు పాల్గొనగా, సర్ ప్రక్రియ దేశానికి నష్టం కలిగించేలా సాగుతోందని ప్రతి ఒక్కరూ అంగీకరించినట్లు చెప్పారు. సర్ ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఖర్గే వ్యాఖ్యానించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు దాదాపు 500 ఓట్ల వరకు తొలగిస్తూ, తమకు అనుకూలమైన వారి పేర్లను కూడా చేరుస్తున్నారని ఖర్గే విమర్శించారు. ఇలా జరిగితే అది నిష్పక్షపాతంగా నిర్వహించిన ఎన్నిక ఎలా అవుతుందని ఖర్గే ప్రశ్నించారు. గతంలో ప్రధానులుగా పనిచేసిన జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావు, రాజీవ్ గాంధీ కూడా ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు ఎన్నడూ పాల్పడలేదని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎన్నికల ప్రక్రియ, సర్ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతాయని ఖర్గే తెలిపారు. అక్టోబర్ 6న దిల్లీలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీ నిర్వహిస్తారని స్పష్టం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి, ప్రతి 34 రోజులకు ఓసారి ప్రచారాలు, నిరసనలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. 2023లో ప్రవేశపెట్టిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు నియామక చట్టంపైనా ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించి ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా తమకు అనుకూలమైన వ్యక్తులనే నియమించుకుంటున్నారని విమర్శించారు.

# పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు ఆకర్షించాలి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** హిల్ట్ పాలసీపై అవగాహన కల్పించేందుకు ఆరు పారిశ్రామిక పార్కుల్లో రోడ్‌షోలు ఏర్పాటు చేయాలని అధికారులను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. మంత్రుల నేతృత్వంలో రోడ్‌షోలు ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్‌కు) భట్టి విక్రమార్క సూచించారు. హిల్ట్ పాలసీలో అభ్యంతరాలు లేని ఇండస్ట్రియల్ పార్కుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్లియర్ చేయాలని ఆదేశించారు. ఆదాయ వనరుల సమీకరణపై కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సచివాలయంలో సమీక్ష జరిపారు. పర్యాటకరంగంపై విస్తృతంగా చర్చించారు. అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు తెలిపారు. పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేలా ప్రాజెక్టులను సిద్ధం చేయాలని సూచించారు. గతేడాది గ్లోబల్ సమ్మిట్‌లో పర్యాటక రంగంలో సుమారు రూ.30వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. డిసెంబరులో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌లో దేశ, విదేశీ పెట్టుబడిదారులకు తెలంగాణ పర్యాటక రంగంలోని అవకాశాలను సమగ్రంగా ప్రదర్శించేందుకు సుమారు 80 ప్రాజెక్టులను సిద్ధం చేయాలని సీఎస్‌కు భట్టి సూచించారు. చారిత్రక కోటలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు పీపీపీ విధానంలో రూ.11 కోట్లతో టెండర్లు పిలిచినట్లు అధికారులు తెలిపారు. టైగర్ టూరిజం కార్యక్రమాలను వెంటనే ప్రారంభించాలని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. నిజాంసాగర్‌లోని నిజాం గెస్ట్‌హౌస్‌ను పర్యాటక అవసరాలకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మూడు జిల్లాల్లో కారవాన్ పార్కుల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు వాణీ ప్రసాద్, సందీప్ కుమార్ సుల్తానియా, గౌరవ్ ఉప్పల్, శశాంక, కృష్ణ భాస్కర్, ఇలంబర్తి, నిఖిల్ చక్రవర్తి, లోకేష్ కుమార్, కృష్ణ ఆదిత్య, సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల భద్రతపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** దిల్‌సుఖ్‌నగర్ సంతోషీమాత ఆలయ ఘటనపై సుధీర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆలయాల భద్రతపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి అని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్రసిద్ధ సంతోషీమాత ఆలయంలో అమ్మవారి విగ్రహంపై దాడి జరిగిన ఘటనపై విషయం తెలుసుకొని ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆలయంలోకి ఓ వ్యక్తి ప్రవేశించి అమ్మవారి విగ్రహంపై దాడికి పాల్పడిన ఘటన సీసీటీవీ కెమెరాల్లో నమోదైనట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, అసలు కారణాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్‌లో గతంలోనూ ముత్యాలమ్మ, చిట్టి ముత్యాలమ్మ, సంతోషీమాత ఆలయాలకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్న విషయాన్ని వారు ప్రస్తావించారు. వరుసగా ఆలయాలకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో, వీటిపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. సంతోషీమాత ఆలయ ఘటన వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీసేలా సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ముద్ద కళ్యాణ్, చంద్రశేఖర్ అజాద్ పాల్గొన్నారు.

# ప్రతి లబ్ధిదారునికి స్మార్ట్ కార్డులు

**విశ్వంభర, సరూర్ నగర్ :** రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం స్మార్ట్ కార్డులు అందజేస్తుందని సరూర్నగర్ డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్ (బాలన్న), సరూర్నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయిని శంకర్ యాదవ్ తెలిపారు. శనివారము సరూర్నగర్, డాక్టర్స్ కాలనీ డివిజన్ ల లోని 10 రేషన్ షాప్ లలో రేషన్ కార్డులు ఉండి రేషన్ తీసుకుంటున్న ప్రతి ఒక్కరికి తెలంగాణ ప్రభుత్వం "స్మార్ట్ కార్డులు " చెరుకు తోట కాలనీ కమ్యూనిటీ హాల్లో పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆకుల అరవింద్ కుమార్ , ధనరాజ్ గౌడ్, చింతకింది రంజిత్, తాండ్ర భాస్కర్. ఇమ్రాన్ అలీ.. సాయి కృష్ణా నగర్ చందర్ యాదవ్ పాల్గొన్నారు.

---

# పాక్‌పై సూపర్ విక్టరీ

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. ఈసారి పురుషుల క్రికెట్ జట్టు పసిడి పతకం అందించింది. ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తు చేసిన శ్రేయస్ నాయకత్వంలోని టీమ్‌ఇండియా 'గోల్డ్'తో మెరిసింది. దీంతో భారత్ ఆసియా క్రీడల పతకాల సంఖ్య 82కి చేరింది. ఇందులో 20 స్వర్ణాలు, 26 రజతాలు, 36 కాంస్యాలు ఉన్నాయి. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన టీమ్‌ఇండియా బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్థాన్ 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. హసన్ నవాజ్ (96) పోరాడినా పాక్‌కు ఓటమి తప్పలేదు. దీంతో ఆసియా క్రీడల్లో భారత్ స్వర్ణం, పాకిస్థాన్ రజతం, శ్రీలంక కాంస్య పతకాలను అందుకొన్నాయి. అంతకు ముందు మూడో స్థానం కోసం పోటీలో బంగ్లాదేశ్‌ను శ్రీలంక ఓడించింది.

### పోటీ ఇచ్చినా..

అసలే జపాన్ పిచ్.. ఇక్కడ 170+ లక్ష్యమంటే అతిపెద్ద సవాల్. ఇక భారత్ 212 పరుగులను నిర్దేశించింది. దీంతో టీమ్‌ఇండియా అలవోకగా గెలిచేస్తుందని అంతా భావించారు. అందుకు తగినట్టుగానే ఆరంభంలో మన బౌలర్లు అదరగొట్టారు. కానీ, పాక్ బ్యాటర్ నవాజ్ మాత్రం పట్టు విడవలేదు. చివరి వరకూ క్రీజ్‌లో ఉండి తన జట్టును గెలిపిచేందుకు ప్రయత్నించాడు. అతడికి సైమ్ అయూబ్ (29), మజ్ సదాఖత్ (23) సహకారం అందించారు. అయితే, కీలక సమయంలో భారత బౌలర్లు వికెట్లు తీసి పాక్‌పై ఒత్తిడి పెంచారు. ఓ వైపు వికెట్లు పడటం.. రన్‌రేట్ కూడా పెరిగిపోవడంతో పాక్‌కు ఓటమి తప్పలేదు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 2.. సుందర్, దూబే చెరో వికెట్ తీశారు.

### అభిషేక్, తిలక్ సూపర్..

పిచ్ మందకొడిగా ఉండటంతో పాక్ తొలి నుంచి స్పిన్నర్లతోనే బౌలింగ్ ఎటాక్‌ను మొదలుపెట్టింది. 18 ఓవర్లను స్పిన్నర్లే వేయడం గమనార్హం. వైభవ్ సూర్యవంశీ (15)తో కలిసి భారత్ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన అభిషేక్ (61: 28 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆరంభంలో ఆచితూచి ఆడాడు. ఓ వైపు వైభవ్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించినా.. అభిషేక్ మాత్రం తొందరపడలేదు. బంతిని సరిగ్గా అంచనా వేసి బౌండరీలు బాదాడు. స్వల్ప వ్యవధిలో వైభవ్‌తోపాటు సంజు (2) ఔటైనప్పటికీ ఆ ప్రభావం భారత్‌పై లేకుండా చేశాడు. శ్రేయస్ (21)తో కలిసి ఇన్నింగ్స్‌ను తీసుకెళ్లాడు. అభిషేక్ ఔటయ్యే సమయానికి భారత్ స్కోరు 93. ఆ తర్వాత టీమ్‌ఇండియా స్కోరు బోర్డు నెమ్మదించింది. పాక్ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఇషాన్ (20), శ్రేయస్ ఇబ్బంది పడ్డారు. దీంతో అసలు భారత్ స్కోరు కనీసం 160 పరుగులైనా దాటుతుందా? అనిపించింది. ఇక్కడే తెలుగు కుర్రాడు తిలక్ వర్మ (51*: 22 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. దూబేతో (27)తో కలిసి బౌండరీల వర్షం కురిపించాడు. దీంతో చివరి ఐదు ఓవర్లలోనే భారత్ 74 పరుగులు రాబట్టింది. దీంతో టీమ్‌ఇండియా స్కోరు కూడా 210+ దాటేసింది. పాక్ బౌలర్లు అహ్మద్ 2, అరాఫత్ 2.. సైమ్, అబ్రార్ తలో వికెట్ తీశారు.

# ఆస్పత్రుల పనులను మరింత వేగవంతం చేయాలి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఈ మేరకు శనివారం సీఎంవో అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన ఆయన.. ఆస్పత్రుల నిర్మాణాలు, సిబ్బంది నియామకాలు, సీజనల్ వ్యాధుల కట్టడి, రాబోయే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల పనులను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్, అల్వాల్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఆస్పత్రుల పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల నిర్మాణాలను కూడా నిర్ణీత గడువులోగా త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొత్తగా నిర్మిస్తున్న ఆస్పత్రులు పూర్తయ్యేలోపే అక్కడ అవసరమైన వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది నియామక ప్రక్రియను ముందస్తుగా ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, ఆసుపత్రులకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. ఇక జిల్లాల్లో కలెక్టర్లు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో విధిగా పర్యటించాలని తేల్చి చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆసుపత్రులను స్వయంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుత సీజన్‌లో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య శాఖ పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వైద్య, విద్యారంగ సమీక్షతో పాటు రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై కూడా సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. వచ్చే డిసెంబర్ నెలలో 'ఫ్యూచర్ సిటీ' వేదికగా జరగనున్న ఈ గ్లోబల్ సమ్మిట్ కోసం పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# రేవంత్ రెడ్డి రాక్షస పాలనలో అధ్వాన్నంగా ప్రభుత్వ హాస్పిటళ్లు

**విశ్వంభర, హైదరాబాద్ :** రేవంత్ రెడ్డి రాక్షస పాలనలో రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటళ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి ప్రభుత్వ హాస్పిటల్ లోని ఎస్ఎన్‌సీయూలో సీలింగ్ కూలిన ఘటనపై "ఎక్స్" వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు చిన్నారులు మృతి చెందిన ఘటన మరవక ముందే భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సీలింగ్ కూలిందని.. ప్రజల ప్రాణాల పట్ల ఈ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ ఘటనతో అర్థం చేసుకోవచ్చన్నారు. సీలింగ్ కూలిన సమయంలో వార్డులో అదృష్టవశాత్తూ పిల్లలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. లేదంటే ఈ ప్రభుత్వం పట్టిలేనితనానికి మరికొంత మంది పసికందులు బలయ్యేవారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో సర్కార్ దవాఖానాకు వెళ్తే ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. "మాట్లాడితే ప్రజా పాలనంటూ గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి.. ఇదేనా మీ ప్రజా పాలన? మీ చేతగానీతనం కారణంగానే సర్కార్ దవాఖానాలు ఇంత అధ్వాన్నంగా తయారయ్యాయి" అని ధ్వజమెత్తారు. హాస్పిటల్స్‌లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, రోగులకు కనీస సౌకర్యాలు, మందులు లేని పరిస్థితి ఉందన్నారు. బెడ్లు లేక వీల్ చైర్ లో చికిత్స చేసే దౌర్భాగ్య స్థితికి తీసుకొచ్చారని మండిపడ్డారు. చేతగానీ కాంగ్రెస్ పాలన కారణంగా ప్రభుత్వ హాస్పిటల్స్ ఎంత దయనీయంగా ఉన్నాయో త్వరలోనే బయటపెడతామని చెప్పారు. ఆపరేషన్ బ్లూ కోడ్ #OperationBlueCode పేరుతో తెలంగాణ రక్షణ సేన నాయకులు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శిస్తారని.. ప్రభుత్వ వైఫల్యం కారణంగా అక్కడ ఎలాంటి దయనీయ పరిస్థితులు ఉన్నాయో ప్రజల ముందుంచుతామని చెప్పారు.

ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలి..

వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రైవేటు బస్సు బోల్తా పడి ముగ్గురు మృతి చెందిన ఘటనపై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన చికిత్స అందించాలని కోరారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# ఓయూలో అక్టోబర్ 6న ఎంఎస్ఎఫ్ జాతీయ సదస్సు

**విశ్వంభర, ఎల్బీనగర్ :** మాదిగ విద్యార్థులు ఐక్యంగా, నిర్మాణాత్మకంగా బలపడి విద్యార్థి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఎంఆర్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం ఎంఎస్పీ ఎల్బీ నగర్ నియోజకవర్గ ఇంచార్జి ఎర్ర రవీందర్ మాదిగ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదిగ విద్యార్థుల చైతన్య సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎంఆర్పీఎస్ ఉద్యమానికి అనుబంధంగా ఎంఎస్ఎఫ్ అనేక పోరాటాలు నిర్వహించి విద్యార్థి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందన్నారు. అక్టోబర్ 6న ఎంఎస్ఎఫ్ జాతీయ సదస్సు విద్యార్థి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్ఎఫ్ ప్రతినిధుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సదస్సుకు ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. అనతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంఎస్ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ అధ్యక్షులుగా జె . రామ్ చరణ్ మాదిగ,ఉపాధ్యక్షులుగా బి . శివ శంకర్ ప్రసాద్ మాదిగ, ప్రధాన కార్యదర్శి గా ఎస్ . సాయి చరణ్ మాదిగ, కార్యదర్శులుగా జె. అరవింద్ మాదిగ, ఎ . శ్రీకాంత్ మాదిగ,సహాయ కార్యదర్శులుగా సి హెచ్ . తనుష్ కుమార్ మాదిగ, టి . ప్రశాంత్ మాదిగ, కోశాధికారి డి . జగదీష్ మాదిగ, గర్ల్స్ వింగ్ అధ్యక్షురాలుగా హెచ్ . సంజన మోచి, ఉపాధ్యక్షురాలుగా నిఖిత మాదిగ, ప్రధాన కార్యదర్శిగా నాగలక్ష్మి మాదిగ, కార్యదర్శులుగా సి . తబితా మాదిగ, డి . వైష్ణవి మాదిగ,ప్రచార కార్యదర్శులుగా ఎస్ . అను ప్రసన్న మాదిగ, జి . వినతి మాదిగ ఎన్నికయ్యారు.